

మళ్లీ వయోజన విద్య

- నవభారత సాక్షరతా పేరుతో నూతన కార్యక్రమం
- నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహణ
- పార్లమెంట్ ఎన్నికల తర్వాత అమలు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 16: వయోజనులైన నిరక్షరాస్యుల్లో అక్షర కాంతులు నింపేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. 'నవ భారత సాక్షరతా' పేరుతో మళ్లీ వయోజన విద్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత విద్యశాఖ సమన్వయంతో అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం 90,828 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో మొదటి విడత కింద ఈ ఏడాది 14,979 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రుపొందిస్తున్నారు. ముందుగా చదువుట, రాయుట, చిన్నచిన్న లెక్కలు చేయడం నేర్పించనున్నారు. అనంతరం క్రిటికల్ లైఫ్ స్కిల్స్‌లో ఫోన్ వినియోగం, డిజిటల్ లిటరసిని నేర్పించనున్నారు. ఒకేషనల్ స్కిల్స్ ద్వారా అక్షరాస్యతతో పాటు ఆర్థిక వనరులు పొందే మార్గాలను సూచించుట, ఫౌండేషన్ స్కిల్స్ నేర్చుకున్న వారికి ప్రాథమిక విద్య ఆపై వాటిని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్స్ ద్వారా నేర్పించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేయనున్నారు. కార్యక్రమ నిర్వహణలో భాగంగా గ్రామ స్థాయిలో హెచ్‌ఎంలు సూపర్‌వైజర్, ఒక ఉపాధ్యాయుడు టీచర్‌గా, మరో ఉపాధ్యాయుడు సర్వేయర్‌గా విధులు నిర్వహించనున్నారు. ఎప్పటికప్పుడు 'ఉల్లాస్' యాప్‌లో నమోదు చేయనున్నారు.

ప్రత్యేక కార్యాచరణ..

వయోజన విద్య కార్యక్రమ నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించాలని నిర్ణయించాయి. ఈ మేరకు వయోజన విద్య, విద్యశాఖ అధికారులకు ఆదేశాలు రావడంతో కార్యాచరణ రూపొందిస్తున్నారు. గతంలో కలెక్టర్‌తో పాటు వయోజనవిద్య డిప్యూటీ డైరెక్టర్‌కు చెక్ పవర్ ఉండగా ప్రస్తుతం కలెక్టర్, డీఈవో పేరున బ్యాంకు ఖాతాలు తెరువనున్నారు.

వలంటీర్లతో బోధన..

న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం ద్వారా 15 నుంచి 50 ఏళ్లలోపు నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులు చేయనున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు చదువు నేర్పనున్నారు. గతంలో సాక్షర భారత్ పథకం కింద సమన్వయకర్తలు చదువు చెప్పేవారు. కొత్తగా చేపట్టే ఈ కార్యక్రమంలో వలంటీర్లను నియమిస్తారు. వీరికి శిక్షణ, సామగ్రిని అందించనున్నారు. 2027 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.

పకడ్బందీగా అమలు చేస్తాం..



వంగల నాగరాజు, వయోజన విద్య ఏపీవో

నవభారత్ సాక్షరత కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తాం. కార్యక్రమానికి సంబంధించి ఆదేశాలు వచ్చాయి. ఇంతలో ఎన్నికల కోడ్ వచ్చింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకా రం మొదటి విడతలో 15 నుంచి 30 ఏళ్లలోపు వారికి చదువు నేర్పించేందుకు చర్యలు తీసుకుంటాం.



నిరక్షరాస్యులకు చదువు చెబుతున్న వలంటీర్లు (ఫైల్)

కొండగట్టుకు భక్తుల పాదయాత్ర

చింతలమానేపల్లి, ఏప్రిల్ 16: కరీంనగర్ జిల్లాలోని కొండగట్టు ఆలయానికి మండలంలోని దిందా గ్రామానికి చెందిన హనుమాన్ మాలాధారణ భక్తులు పాదయాత్రగా మంగళవారం బయలుదేరారు. 41 రోజుల పాటు మాల ధరించి ప్రత్యేక పూజల అనంతరం మాల విరమణ కోసం పాదయాత్రగా వెళ్తున్నట్లు భక్తులు తెలిపారు.

పెంచికలపేట: మండలంలోని దరగపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి హరీష్‌బాబు అభిమానులు కర్నే మహేష్, కర్నే మధుకర్, సామెర సాయి గత అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నియోజక వర్గ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్‌బాబు విజయం సాధిస్తే 21 రోజులు హనుమాన్ మాల ధరించి కొండగట్టు పుణ్యక్షేత్రానికి కాలినడకన వెళ్తామని మొక్కుకున్నారు. ఆ ఎన్నికల్లో హరీష్‌బాబు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో వారు మంగళవారం కొండగట్టు పుణ్యక్షేత్రానికి మొక్కులు చెల్లించుకునేందుకు కాలినడకన బయలుదేరి వెళ్లారు.

కార్మికులకు అవగాహన

పెంచికలపేట, ఏప్రిల్ 16: మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో మంగళవారం బీట్ అధికారి అరుణ్‌రెడ్డి సిమెంట్ పిల్లర్లపై కార్మికులకు అవగాహన కల్పించామన్నారు. నూతన ఇంటి నిర్మాణాలకు ఎటువంటి కలప వాడకుండా పూ ర్తిగా సిమెంట్ పిల్లర్లు, ఐరన్ రాడ్‌లు వాడాలని గ్రామ స్థులకు సూచించారు. చెట్లను ఇష్టారీతిన నరికివేయడం వల్ల భవిష్యత్ తరాలకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

జైనూర్, ఏప్రిల్ 16: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మంగళవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ సత్యశీలిని ప్రారంభించారు. జొన్నలకు క్వింటాలుకు మద్దతు ధర 3,180 రూపాయిలు ఉంటుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోళ్లకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్ర మంలో ఏఏసీ సీఈవో జనార్దన్, మార్క్‌ఫెడ్ అధికారి ప్రేమ్‌సింగ్, మార్కెట్ కమిటీ సిబ్బంది మధు తదితరులు పాల్గొన్నారు.

పౌరాదేవి ఆలయానికి తరలివెళ్లిన భక్తులు

కెరమెరి, ఏప్రిల్ 16: మండలంలోని పలు గ్రామాల సేవాలాల్ భక్తులు తమ ఆరాధ్య దైవం అయిన మహారాష్ట్రలోని కిన్వట్ ప్రాంతంలో గల పౌరదేవి పుణ్యక్షేత్రానికి మంగళవారం తరలి వెళ్లారు. ఉగాది రోజున శంకర్‌లొద్ది పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మరుసటి రోజు నార్నూర్ మండలంలోని కొత్తపల్లి నుంచి పాదయాత్రగా బయలుదేరారు. మంగళవారం అక్కడికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అనార్‌పల్లి మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మే డే పోస్టర్ల విడుదల

ఆసిఫాబాద్, ఏప్రిల్ 16: జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళ వారం మే డే పోస్టర్_ను మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో దినకర్, శంకర్, శ్రీనివాస్, ప్రకాష్, మోహన్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- ఉల్లంఘిస్తే చర్యలు- సమావేశాలకు అనుమతి తప్పనిసరి
- 13న పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు - కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 16: జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం ఎస్పీ సురేష్‌కుమార్, అదనపు కలెక్టర్ దాసరి వేణులతో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలు ఎలాంటి అవాంతరాలు, ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేలా రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కోరారు. ఈ నెల 18న ఎన్నికల గెజిట్ విడుదలై, నామినేషన్లు పరిశీలన, ఉపసంహరణ, అభ్యంతరాల స్వీకరణ, తుది జాబితా విడుదల ప్రక్రియ అనంతరం మే 13వ తేదీన పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతాయని వివరించారు. జూన్ 6 వరకు ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు, ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలన్నారు. ఉల్లంఘనలకు పాల్పడితే భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని తెలిపారు.ఈ నెల 19న జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంల వద్ద గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం ర్యాండమైజేషన్ నిర్వహించనున్నామని తెలిపారు. కేటాయింపు, అనంతరం ఆసిఫాబాద్ నియోజక వర్గానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని పీటీజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు బందో బస్తులో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తరలించి భద్రపరుస్తామని తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు నూతన ఓటరు నమోదు కోసం అందిన దరఖాస్తులను పరిశీలిస్తామని చెప్పారు. నిబంధనల మేరకు అర్హత గల వారికి పార్లమెంట్ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం 12 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై సమాచారం, ఫిర్యాదు చేసేందుకు కలెక్టర్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. సీ-విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారంతో భాగంగా ప్రకటనలు, సభ, ర్యాలీలు, సమావేశాల కోసం 48 గంటలు ముందుగా సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు అనుమతులు జారీ చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావు, డీఎస్పీ సదయ్య, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ సరస్వతీ విద్యాపీఠ ఆవిర్భావ వేడుకలు

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 16: ఆసిఫాబాద్ పట్టణంలోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యాపీఠ ఆవిర్భావ దినం సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి కార్యదర్శి శ్రీనివాస్, వేణుగోపాల్, సంతోష్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. అనంరతం శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. 11 సార్లు శ్రీరామ జపమాల, భజన నిర్వహించారు.

హనుమాన్ ఆలయంలో భజన

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 16: జిల్లా కేంద్రంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 24న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జయంత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో చెట్ల రాజు భజన బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు శిరీష్ శర్మ, అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వెంకన్న, వివేక్, రాధాకృష్ణచారి, సతీష్, సందీప్, అజయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 16: సింగరేణి ఉద్యోగులకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇస్తూ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని సింగరేణి కాలరీస్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు దేగల ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గడిచిన పదేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సింగరేణి సంస్థ 49 వేల 666 కోట్ల రూపాయలను పన్నుల రూపంలో చెల్లించిందని తెలిపారు. అంతేకాకుండా మళ్లీ కార్మికుల నుంచి ఆదాయపు పన్నుల రూపేణా మళ్లీ వసూళ్లు చేసిందన్నారు. దీనివల్ల కార్మికులు 3 నెలలకు చెందిన, అధికారులు 5 నెలలకు చెందిన వేతనాలను పన్నులుగా చెల్లిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇలా కాకుండా సంస్థ నుంచి గాని, ఉద్యోగుల నుంచి గాని మాత్రమే పన్నులు తీసుకోవాలని, రెండు రూపాల్లో వసూలు చేయకూడదని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు ఆలోచించి న్యాయం చేయాలని కోరారు.

వామపక్ష పార్టీల సదస్సుకు తరలిరావాలి

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 16: ఆసిఫాబాద్ పట్టణంలో ఈ నెల 19న నిర్వహించే వామ పక్ష పార్టీల సదస్సుకు కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని న్యూ డెమోక్రసీ, సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ నాయకులు చాంద్‌పాషా, రాజన్న, సత్యనారాయణ, తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పెద్ద సంఖ్యలో వామపక్ష పార్టీల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 16: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సమస్య లన్ను పరిష్కరించాలని మంగళవారం ఆర్‌సీవో స్వరూప రాణికి డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, కేవీపీఎస్ నా యకుడు దినకర్ వినతి పత్రం అందజేశారు. పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు.

శ్రీరామనవమికి ఆలయాల ముస్తాబు

బెజ్జూరు, ఏప్రిల్ 16: శ్రీరామనవమి సందర్భంగా ఆలయాలు ముస్తాబు అవుతు న్నాయి. బుధవారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు ఎల్కపల్లి, చిన్నసిద్దాపూర్, అంబగట్టు,మర్తిడి, బారెగూడ, పోతెపల్లి తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు.



ఆర్‌కే 6 గనిపై శాంతి హోమం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 16: శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే 6 గనిపై ఉగాది నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం శాంతి హోమం నిర్వహించారు. జీఎం బి సంజీవరెడ్డి, గ్రూప్ ఏజెంట్ ఎ వెంకటేశ్వర్ రెడ్డి, మేనేజర్ ఈ తిరుపతి దంపతులు హోమంలో పాల్గొన్నారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యుల క్షేమం కోసం హోమం చేసినట్లు తెలిపారు. కార్యక్ర మంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, పిట్ కార్యదర్శి సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కే న్యూటెక్ పిట్ కమిటీ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 16: ఆర్‌కే న్యూటెక్ గని సీఐటీయూ పిట్ కమిటీని మంగళవారం శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. పిట్ కార్యదర్శిగా పెరుక సదానందం, సహాయ కార్యదర్శిగా అరిగె సందీప్ కుమార్, ఆర్గనైజర్‌గా ముచ్చకుర్తి రమేష్, సీ రిలే ఇన్‌చార్జిగా ఎం. రవికుమార్, బీ రిలే ఇన్‌చార్జిగా అంకం రాజేశ్, జనరల్ షిఫ్ట్ బాధ్యులుగా బోడ రాంజీ, డి రిలే ఇన్‌చార్జిగా రాజగోపాల్‌తో పాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

కార్మికుల హక్కుల సాధనే ధ్యేయం

- కనీస వేతనాల మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్

మందమర్రి టౌన్, ఏప్రిల్ 16: రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత కార్మికుల సమ స్యల పరిష్కారం, హక్కుల సాధనే ధ్యేయంగా పని చేస్తామని రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ తెలిపారు. మందమర్రిలో మంగళవారం ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీని విస్మరించడంతో పాటు కనీస వే తనాలు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా రంగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సంబంధించి కాంట్రాక్టర్లతో మాట్లాడుతామని చెప్పారు. తనపై ఎంతో విశ్వాసం ఉంచి ప్రభుత్వం తనకు పదవి కట్టబెట్టిందని తెలిపారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో 15 సీట్లకు పైగా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని చెప్పారు. త్వరలోనే గోదావరిఖనిలో ఈ నెల 21న 25 వేల మంది ఐఎన్టీయూసీ ము ఖ్య కార్యకర్తలతో మహాసభ నిర్వహించబోతున్నామని ఆయన తెలిపారు.

ఓసీపీ కార్మికులకు ఇన్సెంటివ్ ఇవ్వాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 16: శ్రీరాంపూర్ ఓసీపీలో పనిచేసే కార్మికులందరికీ ఇన్సెంటివ్ ఇవ్వాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో ఓసీపీలో ధర్నా నిర్వహించారు. అనంతరం మేనేజర్ బ్రహ్మాజీకి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తిని ఓసీపీ ఉద్యోగులు సాధించారని తెలిపారు. ఓసీపీ, సీహెచ్‌పీ ఒకేచోట ఉండడం వలన ఉద్యోగులకు ఇన్సెంటివ్‌లు రావడం లేదని, వాటిని వేరుగా చేయాలని డిమాండ్ చేశారు. ఓసీపీ నుంచి 63 రేకుల బొగ్గు రవాణా చేయాల్సి ఉండగా, 95 నుంచి 114 రేకులు రవాణా అయ్యిందన్నారు. ఉద్యోగులకు ఇన్సెంటివ్‌లు ఇస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని సాధించడానికి మరింత ఉత్సాహంతో పని చేస్తారని సూచించారు. జీఎం స్పందించి సమస్య పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, పిట్ కార్యదర్శులు మోతె లచ్చన్న, గునిగంటి నర్సింగరావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు దాడి రాజయ్య, నాగేశ్వర్‌రావు, నల్లపు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యువత వ్యసనాల బారిన పడొద్దు

- ఎస్పీ సురేష్‌కుమార్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 16: యువత వ్యసనాల బారిన పడకుండా చదువుపై దృష్టి సారించాలని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మంగళవారం గంజాయి, కల్తీ కల్లు వినియోగం వల్ల జరిగే అనర్థాలపై రూపొం దించిన పోస్టర్‌ను జిల్లాపోలీసు కార్యాలయంలో ఎస్పీ సురేష్‌కుమార్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయితో పాటు కల్తీ కల్లు వినియోగం ద్వారా వ్యక్తులతో పాటు సమాజానికి జరిగే నష్టాన్ని తెలిపే విషయాలు ఈ పోస్టర్‌లో ఉన్నాయని చెప్పారు. గంజాయి, కల్తీ కల్లు విక్రయాలకు పాల్పడితే ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నంబర్ దీనిపై ఉంటుందని తెలిపారు. గంజాయికి బానిసలుగా మారి యువత తమ భవిష్యత్తు నాశనం చేసుకుంటుందన్నారు. దాని వల్ల వారి జీవితాలు విచ్ఛిన్నం కావడంతో పాటు తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడే వారి సమాచారాన్ని ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి రహిత జిల్లా కోసం అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీ సదయ్య, సీఐలు సతీష్, రమేశ్, ఆర్ఐ పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



నినాదాలు చేస్తున్న నాయకులు

కెరమెరి, ఏప్రిల్ 16: కెరమెరి మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మంగళవారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని పెద్దసాకడ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వా నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను గెలిపించాలని కోరారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు అందడంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఎన్నికలు ముగియగానే గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ పాటు ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేసి గ్రామాల్లో అభివృద్ధి పథంలో అగ్రభాగాన నిలుపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మునీర్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు కుసుంరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేస్తున్న ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా

కెరమెరి, ఏప్రిల్ 16: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని మోడి గ్రామంలోని పాఠశాలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్లలో అవకతవకలు ఉండడం, విద్యార్థులు పాఠశాల బయటికి వెళ్లి నీరు తాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటీడబ్ల్యూవో అర్జున్, ప్రధానోపాధ్యాయుడు సాయిలకు నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రోజు మెనూ ప్రకారం పోషక విలువల గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. పాఠశాల గదులు, పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు సిబ్బంది తొలగించాలని సూచించారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

వాంకిడి, ఏప్రిల్ 16: ఎరువులను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎరువులు విక్రయించిన వెంటనే రశీదులు అందించాలన్నారు. ఎరువులకు సంబంధించిన పూర్తి వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని చెప్పారు. నిలువ ఉన్న ఎరువుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి ఎంఆర్‌పీ ధరలకు మాత్రమే విక్ర యించాలన్నారు. నిబంధనలను పాటించాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఏవో మిలింద్‌కుమార్ ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్, ఏప్రిల్ 16: కాగజ్‌నగర్ మండలం ఈసుగాం సమీపంలో మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న పీడీఎస్ బియ్యాన్ని సోమవారం రాత్రి పట్టుకున్నట్టు రూరల్ సీఐ అల్లం రాంబాబు తెలిపారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు తాము ఈసుగాం చౌక్‌లో వాహనాల తనిఖీలు నిర్వహించగా, 20 క్వింటాళ్ల బియ్యం లోడ్‌తో వెళ్తుతున్న వాహనం ఉందన్నారు. ఈ వాహనాన్ని పూర్తి తనిఖీలు చేయగా మహారాష్ట్రకు అక్రమంగా తరలుతున్నట్టు తేలిందన్నారు. ఈ మేరకు సయ్యద్ ఖాజాపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడుల్లో సిబ్బంది ఎఎస్సై హీరాలాల్, హెచ్‌సీ శంకర్ పాల్గొన్నట్లు తెలిపారు.

కాగజ్‌నగర్: పట్టణంలో మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్టు సీఐ శంకరయ్య తెలిపారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు తైబానగర్‌లో దాడులు చేయగా నాలుగు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించినట్టు వివరించారు. అఫ్రోజ్ పాషా, అంకుష్ బీలపై కేసు నమోదు చేసి పీడీఎస్ బియ్యాన్ని స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు.

ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

సిర్పూర్(టి), ఏప్రిల్ 16: ఉపాధిహామీ పథకం పనులకు కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌పీవో, ప్రత్యేకాధికారి సురేష్‌బాబు అన్నారు. మండలంలోని చింతకుంట, చిప్పపల్లి, హీరాపూర్, శివపూర్ గ్రామాల్లో మంగళవారం ఈజీఎస్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత అధకంగా ఉన్నందున ఉదయమే పనులకు వచ్చి పనులు పూర్తి చేసుకోవాలన్నారు. కూలీ ధర 300 రూపాయలకు పెంచినందున సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఆయన వెంట ఏపీవో చంద్రయ్య ఉన్నారు.

చింతలమానేపల్లి: మండలంలోని ఆడెపల్లి, చింతలమానేపల్లి గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో గోవర్ధన్, ఎఫ్ఏలు, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

టీబీజీకేఎస్ సభ్యత్వ నమోదు

రెబ్బెన, ఏప్రిల్ 16: బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓపెన్ కాస్టులో టీబీజీకెఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా వైస్ ప్రసిడెంట్ మల్రాజు శ్రీనివాస రావు మాట్లాడుతూ టీబీజీకెఎస్ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశం, చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామరక్ష స్తోత్రం పారాయణం

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 16: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ హనుమాన్ ఆలయంలో భక్తులు భక్తి శ్రద్ధలతో శ్రీరామరక్ష స్తోత్రం పారాయణం చేశారు. ఉగాది నుంచి ప్రారంభమైన పారాయణం హనుమాన్ జయంతి వరకు ప్రతి రోజు ఒక్కొక్కరింట్లో నిర్వహిస్తున్నారు. .

విద్యార్థులు ఉన్నత లక్ష్యం అలవర్చుకోవాలి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 16: విద్యార్థులు ఉన్నత లక్ష్యం అలవర్చుకోవాలని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం అన్నారు. మంగళవారం కళాశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం కోసం క్రమశిక్షణతో చదువాలని సూచించారు. అనంతరం పీజీలో ప్రవేశాలు పొందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు ఎస్.వెంకటేశ్వర్లు, ఇ.శారద, టి.దత్తాత్రేయ, దేవేందర్, జనార్ధన్, వెంకటేశం, శారద, కృష్ణవేణి, టీమాజి తదితరులు పాల్గొన్నారు.

వాగులో మునిగి యువకుడి మృతి

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 16: ఆసిఫాబాద్ మండలం గుండిగూడ గ్రామంలో మంగళవారం చేపలు పట్టడానికి వెళ్లి వాగులో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆసిఫాబాద్ పట్టణంలోని బెస్తావాడుకు చెందిన నగోసే శంకర్(27) తన అన్న కొడుకు దశరథ్‌తో కలిసి చేపలు పట్టడానికి ఆడదశ్నాపూర్ గ్రామ పంచాయతీలోని గుండిగూడ వాగుకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదావశాత్తు శంకర్ వాగులో పడిపోయాడు. దశరథ్ వాగు పరిసర ప్రాంతాల్లో వెతకగా శంకర్ ఆచూకీ లభించలేదు. వెంటనే ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలియజేశాడు. పలువురు వాగు వద్దకు చేరుకుని గాలించి ఒడ్డుకు చేర్చే సమయానికి శంకర్ మృతి చెందాడు. మృతుడి భార్య సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీష్ తెలిపారు.

ప్రతి కూలీకి పని కల్పించాలి

వేమనపల్లి, ఏప్రిల్ 16: ఉపాధిహామీలో ప్రతి కూలీకి పని కల్పించాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రవీణ్, ఏపీవో సత్య ప్రసాద్,ఏఈ నరేష్ పాల్గొన్నారు.

భీమారం: ప్రతి కూలీకి పనులను కల్పించాలని డీఆర్‌డీవో కిషన్ పేర్కొన్నారు. ఖాజీపల్లి, నర్సింగాపూర్, భీమారం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఎంపీడీవో రాథోడ్ రాధ, ఏపీవో జీనత్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 16: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. మంగళవారం రైల్వేస్టేషన్, పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద గంజాయి, కల్తీ కల్లును నిర్మూలిద్దాం-సమాజాన్ని కాపాడుదాం అనే నినాదంతో కూడిన పోస్టర్లను అంటించారు. రూరల్ సీఐ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. టూ టౌన్ ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ నర్సయ్య పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 16: విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరవచ్చని, ఆస్తులు ఎన్ని ఉన్నా తరిగి పోతాయని, విద్యను ఎవరు అపహరించలేరని జబర్దస్త్ ఫేం వెంకీ మంకీ తెలిపారు. మంగళవారం సాయి మిత్ర గార్డెన్‌లో వివేకవర్ధిని డిగ్రీ పీజీ కళాశాల వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చేసి నృత్యాలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వెంకీ మంకీని సన్మానించారు.

పెళ్లిపత్రికలు పంచడానికి వెళ్లి అనంతలోకాలకు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 16: లక్షెట్టిపేటకు చెందిన శ్రీకాంత్, బోరెం మహేష్ (21) అనే ఇద్దరు వ్యక్తులు దూరపు బంధువుల పెళ్లి పత్రికలను తమ బంధువులకు పంచడానికి ద్విచక్రవాహనంపై మంగళవారం జగిత్యాల జిల్లా మల్యాల మండలం లంబాడిపెల్లి గ్రామానికి బయల్దేరారు. సాయంత్రం తమ స్వగ్రామం లక్షెట్టిపేటకు బయల్దేరారు. ధరూర్ వద్ద ద్విచక్రవాహనాన్ని వెనుకవైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ద్విచక్ర వాహనం వెనుక కూర్చొన్న మహేష్ కు తీవ్ర గాయలవడంతో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మహేష్ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


తిరుపతి (ఫైల్)

భీమారం, ఏప్రిల్ 16: పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంకుశాపూర్ గ్రామానికి చెందిన అనపర్తి తిరుపతి (58) అనే రైతు మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. తిరుపతి గ్రామ సమీపంలో ఉన్న రెండున్నర ఎకరాల్లో వరి పంట వేశాడు. పంటకు నీరు పెట్టేందుకు మంగళవారం భార్య తో కలిసి పొలం గట్టుపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్నారు. ప్రమాదవశాత్తు తిరుపతి కాలుజారి పొలం గట్టు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎల్‌టీ లైన్ వైర్‌పై పడడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక వస్తున్న భార్య లక్ష్మి గమనించి స్థానికులు, బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాములు తెలిపారు.

మెట్లపై నుంచి కింద పడి వృద్ధుడి మృతి

నెన్నెల, ఏప్రిల్ 16: మైలారం గ్రామానికి చెందిన కంపెల లింగయ్య (64) అనే వృద్ధుడు మెట్లపై నుంచి కింద పడి మృతి చెందాడు. లింగయ్య సోమవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చి మెట్లు ఎక్కే క్రమంలో కింద పడ్డాడు. తలకు తీవ్రమైన గాయమైంది. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి లింగయ్యను పరిశీలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య భాగ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

పాఠశాలల్లో అత్యవసర పనులను వేగవంతం చేయాలి


జైపూర్, దండేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవోలు

జైపూర్, ఏప్రిల్ 16: ప్రభుత్వ పాఠశాలల్లో చేయాల్సిన అత్యవసర పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల సమాఖ్య కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కమిటీలో ప్రతి పాఠశాలకు వీవో లీడర్ చైర్‌పర్సన్‌గా, ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా ఉంటారన్నారు. వీరిద్దరి జాయింట్ ఖాతా నుంచి నిధులు కేటాయిస్తారన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల పునర్ నిర్మాణం, తరగతి గదుల విద్యుద్దీకరణ, పారిశుధ్య పనులపై మొదట 25 శాతం నిధులు కేటాయించడం, పనులు పూర్తయిన తర్వాత 75 శాతం అందజేస్తారన్నారు. లక్ష రూపాయల పైన పనులు ఉంటే కలెక్టర్‌కు దరఖాస్తు చేయాలని ఎంపీడీవో సూచించారు. పంచాయతీ రాజ్ ఏఈ రవికుమార్, ఏపీఎం రాజ్‌కుమార్, వీవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి పనులను సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవో రవీందర్‌లు సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షుడు, పాఠశాల హెచ్‌ఎంలతో ప్రధానోపాధ్యాయుడు బీసగోని శంకర్‌గౌడ్ అవగాహన కల్పించారు. ఎంపీవో శ్రీనివాస్, ఐటీడీఏ ఏఈఈ రాజేశ్వర్‌సింగ్, ఏపీఎం బ్రహ్మయ్య, స్కూల్ కాంప్లెక్ హెచ్‌ఎంలు చిన్న నర్సయ్య, రాజు, విజయలక్ష్మి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలకు ఎంపీడీవో రాజేశ్వర్, ఎంఈవో జాడి పోచయ్య అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను బలోపేతం చేయాలన్నారు. మరుగుదొడ్లు, నీటి వసతి తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎంపీవో బీరయ్యఏపీఎం లలితకుమారి, ఏఈ బషీర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమారం: ఎంపీడీవో కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీపై ఎంపీడీవో రాథోడ్ రాధ సమావేశం నిర్వహించారు. అత్యవసర మరమ్మతు, మౌలిక సదుపాయాల కల్పన గురించి అవగాహన కల్పించారు. నిధులు కేటాయించిన పాఠశాలల్లో జూన్ మొదటి వారంలోగా పనులు పూర్తిచేయాలని ఉపాధ్యాయులకు, వీవో సంఘాలకు, ఏఈపీఆర్ అధికారులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు, మహిళ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

భీమిని: రాంపూర్ రైతు వేదికలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో గంగామోహన్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడం లక్ష్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఎంపీవో సఫ్దర్ అలీ, ఏఈ పీఆర్ కళ్యాణ్‌రెడ్డి, ఏపీఎంలు, వీవోలు పాల్గొన్నారు.

చెన్నూరు: అమ్మఆదర్శ పాఠశాల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మోహన్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, తరగతి గదుల మరమ్మతు, మరుగుదొడ్లు మౌలిక వసతులు వేగవంతం చేయాలని సూచించారు. ఎంఈవో రాధా కృష్ణమూర్తి, ఎంపీవో అజ్మత్ అలీ, ఏపీఎం ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

భీమిని, ఏప్రిల్ 16: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరిలక్ష్మణ్ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున తీర్మానాలు లేకుండా సాదాసీదాగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు పలు అంశాలపై అధికారులతో చర్చించారు. వైస్ ఎంపీపీ చిలుముల మధు, ఎంపీడీఓ గంగామోహన్, కోఆప్షన్ సభ్యుడు ఆరీఫ్, ఎంపీవో సఫ్దార్ అలీ, డీటీ అంజయ్య, ఏపీఓ భాస్కర్‌రావు, ఏపీఎం ప్రకాష్ గౌడ్, జూనియర్ అసిస్టెంట్ లలిత, లైబ్రేరియన్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

జన్నారం, ఏప్రిల్ 16: ఇందన్‌పల్లి, మొర్రిగూడ, దేవునిగూడ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ మోతిలాల్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. తహసీల్దార్ రాజమోహన్‌రెడ్డి, ఆర్‌ఐ భానుచందర్, ఏపీఎం బుచ్చన్న,సెంటర్ ఇన్‌చార్జీలు మహేందర్, సరోజ, సునీత, బుక్ కీపర్లు రమేష్‌సుధాకర్,సత్యం పాల్గొన్నారు.

లోడింగ్ కార్మికుల ఔదార్యం

కాసిపేట, ఏప్రిల్ 16: మల్కేపల్లిలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన కుడిమేత రాంచందర్ కుటుంబానికి దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ లోడింగ్ కార్మికులు రూ.10 వేల నగదును మంగళవారం అందజేశారు. రాంచందర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించినట్లు కార్మికులు తెలిపారు.

బీజేపీని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 16: బీజేపీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని జిల్లా అధికార ప్రతినిధి పల్లె రాకేష్, రాష్ట్ర నాయకులు దుర్గం అశోక్ పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాకా కుటుంబం మెప్పు కోసం మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నాయకులు దుర్గం నరేష్‌లు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇతర పార్టీలను కుటుంబ పాలనను విమర్శించే ఎమ్మెల్యే చేస్తున్నదేమిటన్నారు. నల్లాల ఓదెలుకు సంబంధించిన చెన్నూరు సీటును ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తీసుకొని ఎమ్మెల్యేగా గెలిచాడని, ఈ విషయాన్ని జిల్లా అధ్యక్షుడు మాట్లాడితే ఓదెలు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీజేపీని విమర్శించి కాకా కుటుంబానికి దగ్గర కావాల్సిన చూస్తున్న నాయకులకు ఈ ఎన్నికల్లో ప్రజలే గుణ పాఠం చెబుతారని, పెద్దపల్లి పార్లమెంట్ స్థానంలో విజయం సాధించేది బీజేపీ అని పేర్కొన్నారు. నాయకులు కుమారస్వామి, సుంకరి రాజేషం, డీవీ దీక్షితులు, రొడ్డ మోహన్, నరేష్, శ్రీనివాస్, రాంకిష్టయ్య, శనిగారపు సతీష్ పాల్గొన్నారు.

వంశీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రిరూరల్, ఏప్రిల్ 16: ఎంపీ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సొత్కు సుదర్శన్, పట్టణాధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు బానోత్ నీలయ్య, మండల నాయకులు కడారి జీవన్‌కుమార్, జిల్లాప్రధాన కార్యదర్శి మండ భాస్కర్‌లు పేర్కొన్నారు. మంగళవారం గాంధారి వనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాన్ని కాకా కుటుంబం దశాబ్దాలుగా అభివృద్ధి చేస్తుందన్నారు. చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాలను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యేలు వివేక్,వినోద్‌లు కృషి చేస్తున్నారన్నారు. నెరివెట్ల శ్రీనివాస్, రమేష్, గడ్డం రజనీ, ఎండీ జమీల్, హఫీజ్, రవి,రవీందర్, నర్సోజీ, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి అమరుల స్ఫూర్తిని చాటుదాం

- సీపీఐ(మావోయిస్టు) అధికార ప్రతినిధి జగన్

మంచిర్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి అమరుల స్ఫూర్తిని చాటుదామని సీపీఐ(మావోయిస్టు) రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ అన్నారు. మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో నిర్వహించిన సభకు హాజరైన ఆదివాసీలు, గిరిజనులపై పోలీసులు కాల్పులు జరిపి జలియన్‌వాలాబాగ్‌ను తలపించారన్నారు. పదుల సంఖ్యలో చనిపోగా, వందలాది మంది గాయపడ్డారని గుర్తు చేశారు. 1982లో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలో గిరిజన, రైతు, కూలీ సంఘాల ఆధ్వర్యంలో 120 అడుగుల స్మారక స్థూపాన్ని నిర్మించగా అప్పటి ప్రభుత్వం 1986లో కూల్చివేశారన్నారు. ప్రజల నుంచి నిరసన వ్యక్తం కావడంతో అప్పటి ఎన్‌టీఆర్ ప్రభుత్వం మళ్లీ స్థూపాన్ని నిర్మించిందన్నారు. అప్పటి నుంచి ఆదివాసీలు ఏప్రిల్ 20న అమరులను స్మరించుకుంటున్నారన్నారు. 1/70 చట్టం, పెసా చట్టం, 5వ షెడ్యూల్, జీఓ నెం. 3, 2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఆదివాసీ గూడేలలో ఎత్తివేసిన పాఠశాలలను పునరుద్ధరించాలని, గిరిజన యూనివర్శిటీలు ఏర్పాటు చేయాలని, ఆదివాసీలనే ఉపాధ్యాయులుగా నియమించాలని, ప్రత్యేక డీఎస్సీతో ఆదివాసీ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో ఆదివాసీలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఓపెన్‌కాస్ట్ గనులు, ఐరన్ గనులను రద్దు చేయాలని, కవ్వాల టైగర్ జోన్‌ను ఎత్తివేయాలని, ఆదివాసీ హక్కుల కార్యకర్తలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులపై నమోదైన ఉపా కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జల్, జంగల్, జమీన్, ఇజ్జత్ అధికారం దక్కేవరకు ఇంద్రవెల్లి అమరుల స్ఫూర్తితో పోరాడుతూ, దోపిడీ పాలకవర్గాల ప్రభుత్వాలను కూల్చివేసి నూతన సమాజాన్ని నిర్మిద్దామని ఆయన ప్రజలను కోరారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

జైపూర్, ఏప్రిల్ 16 : కుందారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రీశ్రావణి మంగళవారం సొంత ఖర్చులతో ప్లేట్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్లేట్లను తల్లి వెంకటనర్సమ్మ కోరిక మేరకు అందజేసినట్లు తెలిపారు. మున్ముందు పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల, బెల్లంపల్లి రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్‌లు సురేష్‌కుమార్, సునీత, ఇన్‌చార్జీ హెడ్‌మాస్టర్ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

భీమారం, ఏప్రిల్ 16 : మండల బీజేపీ కమిటీని జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ మంగళవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా బోర్లకుంట శంకర్, ప్రధాన కార్యదర్శులుగా వేల్పుల రాజేష్‌యాదవ్, మాడెం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గజ్జెల సురేష్, కొమ్ము దుషాంత్‌యాదవ్, జనార్దన్, మధు, కార్యదర్శులుగా ఆకుదారి శంకర్, చంద్రయ్య, రాజం, ఆకుదారి మల్లేష్, కోశాధికారిగా ఏల్పుల సతీష్, యువ మోర్చా అధ్యక్షుడిగా సందీప్, మహిళ మోర్చా అధ్యక్షురాలిగా మేడి విజయలను ఎన్నుకున్నారు.

కార్డెన్ సెర్చ్

జన్నారం, ఏప్రిల్ 16: మండలంలోని సింగరాయిపేటలో మంగళవారం ఎస్‌ఐ రాజవర్దన్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇండ్లలో తనిఖీలు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. గుడుంబా, గంజాయి సాగు, తయారు చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

జైనూర్, ఏప్రిల్ 16: ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐడీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మండల కేంద్రంలో గల సమాగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంటశాల గదులుతోపాటు రిజిస్టర్లు, సామగ్రి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ సమాగ్ర గిరిజనాభివృద్ధి పాఠశాలలో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ క్రమంలో పాఠశాలలోని ఆర్‌వోఆర్ ప్లాంట్ పని చేయకపోవడం, విద్యార్థులు తాగునీటి కోసం ఫిజిక్స్ ఉపాధ్యాయుడితో కలిసి బయటకు వెళ్లడం, పాఠశాల హాజరు రిజిస్టర్లు, నిల్వ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడాన్ని పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్ర మంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు మహర్దశ

'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీల ద్వారా మౌలిక వసతుల కల్పన


కన్నేపల్లి ఎంపీపీఎస్ పాఠశాల

లింగాపూర్, ఏప్రిల్ 16: మండలంలోని పాఠశాలలకు మహర్దశ పట్టనుంది. మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఆయా పాఠశాలల్లో విద్యనభ్యసించే పిల్లల తల్లులు ఈ కమిటీల్లో సభ్యులుగా ఉంటారు. పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులను వారే ప్రతిపాదిస్తారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్ర మంతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు నిధులు మంజూరు కానున్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటుచేసి వారిద్వారా పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు. మండలంలోని చోర్‌పల్లి, గౌతమిగూడా, ఘామ్‌నూర్(కే), ఘామ్‌నూర్(బి) తదితర మండలంలోని మొత్తం పాఠశాలలకు మరమ్మతులకు లక్ష నుంచి 2లక్షల వరకు ప్రభుత్వం నిధులు మం జూరు చేయనుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సివిల్స్‌లో 190 ర్యాంకు


శుభం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 16: కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయం 19వ ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థి రెకుల్వార్ శుభంకు సివిల్స్‌లో 190 ర్యాంకు సాధించినట్టు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. మంగళవారం సివిల్స్ ఫలితాలు విడుదలైనట్టు తెలిపారు. శుభం 2005 నుంచి 2010 వరకు నవో ద యలో చదువుకున్నట్టు తెలిపా రు. ఉట్నూరు మండలం ముత్నూరు నివాసి కాగా తండ్రి సత్యనారాయణ పాత్రికేయుడిగా పని చేస్తున్నారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

రెబ్బెన, ఏప్రిల్ 16: సింగరేణిలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ పర్మేషన్ కమిటీ ఛైర్మన్ సిద్దం శెట్టి రాజమౌళి తెలిపారు. మంగళవారం గోలేటి వర్క్‌షాప్ కార్మికులను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రకాశ్‌రావు, నల్లగొండ సదాశివ, దుర్గం రవీందర్ పాల్గొన్నారు.

ఎండిపోతున్న పంటలు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 16: మండలంలోని రన్‌వెల్లి గ్రామ శివారు ప్రాంతాల్లో యాసంగిలో సాగు చేసిన వరి పంటలు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో ఎండి పోతున్నట్లు రైతులు తెలిపారు. కౌటాల మండలం గుండాయిపేట సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతున్నా త్రీఫేస్ విద్యుత్ అందించకపోవడంతో పంటలకు నీరు పెట్టలేక పోతున్నామని, సాగు నీరు అందక నెర్రబారినట్లు రైతులు వాపోతున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి త్రీఫేస్ విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


నీరు లేక ఎండిపోయిన వరి పంట

బీజేపీ వైపు 'అరిగెల' బ్రదర్స్ చూపు?


నాగేశ్వర్‌రావు, మల్లికార్జున్

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 16: రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తరువాత ఒక్కొక్కరిగా జిల్లాలోని నేతలు బీఆర్‌ఎస్ నుంచి ఇతర పార్టీలోకి వెళ్తున్నారు. ఇప్పటికే పార్టీ జిల్లాలో అధ్యక్షుడితో పాటు అనేక మంది కాంగ్రెస్‌లోకి వెళ్లగా తాజాగా ఆసిఫాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ నేతలు అరిగెల బ్రదర్స్ బీజేపీలోకి టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో ఎంపీ ఎన్నికల సమయం నాటికి జిల్లాలో బీఆర్‌ఎస్ ఖాళీ అవుతుందేమో అన్న అనుమానాలు కలుగుతుంది. సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు ఇదే ట్రెండ్‌గా మారింది. కాగా ఇప్పటికే సిర్పూర్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున అధికార పార్టీతో పాటు బీజేపీలోకి నాయకులు వలస వెళ్లగా తాజాగా ఆసిఫాబాద్ నియోజక వర్గంలో కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్‌తో సహా మండలానికి చెందిన పలువురు నాయకులు బీజేపీలోకి టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. దీనికి బలం చేకూరుస్తూ బీఆర్‌ఎస్ మాజీ నాయకుడు బీజేపీ ప్రస్తుతం ఎంపీ అభ్యర్థి గొడెం నగేష్ సోమవారం ప్రచారానికి వచ్చి జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌తో సహా నాయకులుఎంపీపీ మల్లికార్జున్‌ను ఆయన నివాసంలో కలవడం చర్చనీయాంశమైంది.



పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఫైనాన్స్ కంపెనీలు



- అధిక వడ్డీ వసూలుతో నడ్డి విరుస్తున్న నిర్వాహకులు
- బ్లాంక్ చెక్కులు, ప్రామిసరీ నోట్లతో ష్యూరిటీలు
- పోలీసుల దాడుల్లో వెలుగులోకి అక్రమాలు

మంచిర్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రోజు రోజుకూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వడ్డీ వ్యాపార సంస్థలు అధిక వడ్డీలు వసూలు చేస్తూ సామాన్యుల జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నాయి. రూ.3 మొదలుకొని రూ.10 వరకు వడ్డీలు వసూలు చేస్తూ కోట్లకు పడగలెత్తున్నాయి. ఎలాంటి లెక్కలు, పత్రాలు లేకుండా అక్రమంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ అందినకాడికి దండుకుంటున్నాయి. వడ్డీ వ్యాపారుల దెబ్బకు సామాన్య ప్రజలతోపాటు చిరు వ్యాపారులు విలవిల్లాడుతుండగా, నెలనెల వడ్డీలు చెల్లించని వారిపట్ల కఠిన వైఖరి అవలంబిస్తున్నాయి.

సామాన్య ప్రజల అవసరాన్ని వ్యాపారంగా మలుచుకుంటూ అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారు. హైర్ పర్చేజ్ అండ్ ఫైనాన్స్‌ల పేరుతో విలువైన డాక్యుమెంట్లు తనఖా పెట్టుకుంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారు. రిజిస్ట్రేషన్‌లు ఉన్న ఫైనాన్స్‌ల్లో సైతం జామీనుగా బ్లాంకు చెక్కులు, ప్రామిసరీ నోట్లు ష్యూరిటీ కింద తీసుకోకూడదనే నిబంధన ఉన్నప్పటికీ, వాటి ఆధారంగానే అప్పులు ఇవ్వడం పరిపాటిగా మారింది. రిజిస్ట్రేషన్ల శాఖ నియమ, నిబంధనల ప్రకారం ఫైనాన్స్ కంపెనీలు అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాల్సి ఉండగా, అవేమీ లేకుండానే వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

నిబంధనలు బేఖాతరు

రిజిస్ట్రేషన్లు ఉన్న వాటికంటే ఎలాంటి నిబంధనలు పాటించకుండా వడ్డీ వ్యాపారం చేసేవాళ్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. జిల్లా కేంద్రమైన మంచిర్యాలలో ఈ పరిస్థితి మరింత భయంకరంగా తయారైంది. గల్లిగల్లికో ఫైనాన్స్ సంస్థ ఏర్పాటైందంటే అతిశయోక్తికాదు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, జ్యూయలరీ షాపులు, వందలాదిగా ప్రైవేటు వ్యక్తులు ఫైనాన్స్ సంస్థలను నెలకొల్పుతూ అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. వడ్డీ వ్యాపారానికి సంబంధించి ఎన్నో చట్టాలు ఉన్నప్పటికీ అవి కాగితాలకే పరిమితం కావడంతో వ్యాపారులు ఆడిందే ఆటగా పరిస్థితి తయారైంది. వడ్డీ వ్యాపారం చేయాలంటే జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి లైసెన్సు తప్పనిసరి. అయితే జిల్లాలో లైసెన్సు ఉన్న ఫైనాన్స్ సంస్థలకంటే అనధికారికంగా వడ్డీ వ్యాపారం చేసే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. రెండు రోజులుగా ఫైనాన్స్ కంపెనీలపై దాడులు నిర్వహించిన పోలీసులు, అనధికారికంగా వడ్డీ వ్యాపారం చేసేవారిపై కూడా దృష్టిసారిస్తే సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగే అవకాశం ఉంది.



ఫైనాన్స్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు (ఫైల్)

అక్రమార్కులపై చర్యలకు రంగం సిద్ధం

వడ్డీ వ్యాపారం పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న పలు ఫైనాన్స్ కంపెనీల నిర్వాహకులకు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో నోటీసులు జారీ చేశారు. రెండు రోజులు క్రితం జిల్లా వ్యాప్తంగా వడ్డీ వ్యాపారులపై దాడులు నిర్వహించిన పోలీసులు నిర్వాహకుల నుంచి పెద్ద మొత్తంలో రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన అనంతరం అక్రమ వ్యాపారులకు సంబంధించి అరెస్టులు చేసేందుకు సైతం రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

బ్లాంకు చెక్కులు తనఖా....

ఫైనాన్స్ కంపెనీలు, చిట్ ఫండ్స్‌తో సహా ఇతరత్రా వడ్డీ వ్యాపారం చేసే కంపెనీలు బ్లాంకు చెక్కులు తీసుకొని లావాదేవీలు నిర్వహించడం చట్టరీత్యా నేరం. అప్పు తీసుకున్న వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడం, రుణ గ్రహీతలను వేధింపులకు గురి చేయకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ అవేమీ పాటించకుండా ఇష్టారీతిన వడ్డీ, చక్ర వడ్డీలు వసూలు చేస్తున్నారు. అప్పు ఇచ్చే క్రమంలో తీసుకొనే బ్లాంకు ప్రామిసరీ నోట్లతో కోర్టుల్లో కేసులు వేసి మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. జ్యూయలరీ షాపులు, బట్టల దుకాణాల్లోనూ వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ సామాన్యుల అవసరాలతో వ్యాపారం చేస్తున్నారు. బంగారం, భూముల డాక్యుమెంట్లు కుదువ పెట్టుకొని అప్పులు ఇస్తూ, వడ్డీలు కట్టడంలేదనే సాకుతో వాటిని స్వాధీనం చేసుకొంటున్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



బెల్లంపల్లిలో అక్రమ కట్టడాల కూల్చివేత

బెల్లంపల్లి, ఏప్రిల్ 16: పట్టణంలోని రడగంబాలబస్తీ అంబేద్కర్‌నగర్, మండలంలోని పెద్దబూద గ్రామపంచాయతీలోని ఇందిరమ్మకాలనీలో మంగళవారం రెవెన్యూ, మున్సిపల్, పోలీసుల ఆధ్వర్యంలో అక్రమ కట్టడాలను కూల్చివేశారు. అనుమతులు లేకుండా నిర్మించిన ఇండ్లతోపాటు ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన ఇండ్లను ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేశారు. మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టవద్దని, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠినచర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో కూల్చివేశామని తెలిపారు. అక్రమ కట్టడాలు కూల్చివేసే సమయంలో కొందరు ఇంటి నిర్మాణం చేపట్టిన వారు అధికారులను కూల్చవద్దని ప్రాధేయపడ్డారు. ఆత్మహత్య చేసుకుంటామని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ భూమిలో నిర్మించడంతోనే కూల్చివేశామని అధికారులు తెలిపారు.

విత్తనాలు, ఎరువులకు ఇండెంట్ పెట్టుకోవాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

నెన్నెల, ఏప్రిల్ 16: వానాకాలం సీజన్‌లో విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి జి.కల్పన అన్నారు. సీజన్‌కు సరిపడ విత్తనాలు, ఎరువుల కోసం ఇండెంట్ పెట్టుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలు, ఎరువుల గోదాములను మంగళవారం తనిఖీ చేశారు. గోదాముల్లో నిల్వలు, దుకాణాల్లో స్టాక్ రిజిష్టర్లు, బిల్‌బుక్కులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులను గరిష్ట చిల్లర ధర కంటే ఎక్కువకు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణం ఎదుట స్టాక్, ధరలు, విత్తనాల వివరాలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అమ్మకాలు, రైతుల వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. గొర్లపల్లి శివారులోని వరి పొలాలు, కూరగాయల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ప్రేమ్‌కుమార్, ఏఈవోలు రాంచందర్, సుప్రజా ఉన్నారు.

డీజే నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

వేమనపల్లి, ఏప్రిల్ 16: మండలంలోని డీజేల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ సూచించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శుభాకార్యాలకు డీజేలు పెట్టాలనుకుంటే పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. డీజే అనుమతి తీసుకున్న తర్వాత రాత్రి 10 గంటలలోగా ముగించాలన్నారు. డీజే శబ్దాన్ని 60 నుంచి 80 డిసిబుల్స్ మధ్యలో పెట్టుకోవాలని, ఎక్కువగా పెడితే చిన్న పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు ఇబ్బందులు పడతారని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

చేప పిల్లల పంపిణీకి నిధులు జమ చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ

ఏసీసీ, ఏప్రిల్ 16: చేప పిల్లల పంపిణీకి మత్స్య సొసైటీ ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేయాలని మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాలులో నిర్వహించిన మత్స్యకారుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి ఎలాంటి పథకాలు ప్రకటించ లేదన్నారు. మత్స్యశాఖ కమిషనర్ పోస్టులో అదనపు కమిషనర్‌ను నియమించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు, కుంటల లీజును రద్దు చేయాలని కోరారు. సమావేశంలో బోడెంకి చందు, గుమ్ముల శ్రీనివాస్, నారాయణ, ఆశన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు నెలకు రూ. 12 వేలు ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న ఆటో యూనియన్ నాయకులు

ఏసీసీ, ఏప్రిల్ 16: రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు నెలకు రూ. 12 వేల జీవన భృతి ఇవ్వాలని ఆటో యూనియన్ రాష్ట్ర జేఏసీ నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు హాలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకంతో ఆటోలు నడుపుతూ జీవనం సాగించే వారికి ఉపాధి కరువై నష్టపోయారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 50 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేలు అందించాలన్నారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, అధికార ప్రతినిధి మధు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మధుకర్, రాజగౌడ్ పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంక్ సాధించిన విశాల్



తల్లిదండ్రులతో విశాల్

జైపూర్, ఏప్రిల్ 16: యూపీఎస్సీ ఫలితాల్లో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ కుమారుడు ఆరే విశాల్ ఆలిండియాలో 718 ర్యాంకు సాధించాడు. విశాల్ విద్యాభ్యాసం సెంట్ క్లెయిర్స్ ఎన్టీపీసీ రామగుండంలో, 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అభ్యాస రెసిడెన్షియల్ పాఠశాల తూప్రాన్‌లో చదువుకున్నాడు. ఇంటర్ హైద్రాబాద్‌లోని నారాయణ కాలేజీలో పూర్తి చేశాడు. తర్వాత ఐఐటీని ఉత్తరాఖండ్‌లోని రుర్కీ కళాశాలలో 2020లో బీటెక్ మెకానికల్ పూర్తి చేశారు. అప్పటి నుంచి సివిల్స్ ఆన్‌లైన్ ద్వారా కోచింగ్ తీసుకుంటూ ప్రిపేర్ అయ్యాడు. దీంతో యుపీఎస్ ఫలితాల్లో 718 ర్యాంకు సాధించాడు. ర్యాంకు సాధించిన విశాల్‌ను పలువురు అభినందించారు.

మండుతున్న ఎండలు

మంచిర్యాల, ఏప్రిల్ 16: జిల్లాలో మంగళవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాసిపేట మండలంలో 42.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా, జన్నారం మండలంలో అత్యల్పంగా 41.6 డిగ్రీలు నమోదయ్యాయి. చెన్నూరు 42.8 డిగ్రీలు, హాజీపూర్ 42.5 డిగ్రీలు, భీమారం 42.3 డిగ్రీలు, నస్పూర్ 42.2 డిగ్రీలు, కోటపల్లి 42.1 డిగ్రీలు, బెల్లంపల్లి 41.9 డిగ్రీలు, దండేపల్లి 41.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

పీహెచ్‌సీని పరిశీలించిన డీఎంహెచ్‌వో

చెన్నూరు, ఏప్రిల్ 16: మండలంలోని అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీని మంగళవారం డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు పరిశీలించారు. పీహెచ్‌సీలోని ఓపీ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యులు శిల్ప, కృష్ణతేజ, పీవో ప్రతాప్, హెచ్ఈవో జగదీష్ పాల్గొన్నారు.

నస్పూర్‌లో మినీ విమానం చక్కర్లు

నస్పూర్, ఏప్రిల్ 16: నస్పూర్ పట్టణంలోని ఊరు నస్పూర్, నస్పూర్ కాలనీ, గోదావరి కాలనీ, సీసీసీల మీదుగా మంగళవారం మధ్యాహ్నం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు పలుమార్లు మినీ విమానం చక్కర్లు కొట్టింది. ఇళ్ల సమీపం ఎత్తు నుంచి వెళ్లడంతో పెద్ద శబ్దం వచ్చింది. ఎస్సై రవికుమార్‌ను సంప్రదించగా తమకు సమాచారం లేదన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

హాజీపూర్, ఏప్రిల్ 16: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడిందని ఎంపీడీవో మధుసూదన్ తెలిపారు. సభ్యులు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు.

జన్నారంలో భారీ వర్షం

జన్నారం, ఏప్రిల్ 16: జన్నారం మండలంలో మంగళవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వారసంతకు వచ్చిన ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వర్షానికి సంతలో వేసిన టెంట్లు గాలికి ఎగిరిపోయాయి. వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. తపాలపూర్ వద్ద చెట్లు రోడ్డుపై పడిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సుమారు 2 గంటల పాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేవునిగూడ, కామనపల్లి ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో మామిడి పంట నేలపాలైంది. అలాగే కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

జామమజీద్ కమిటీ ఎన్నిక

జైపూర్, ఏప్రిల్ 16 : మండలంలోని ఇందారంలో మంగళవారం జామ మజీద్ కమిటీని ఎన్నిక నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా మహమ్మద్ యూసుఫ్, వైస్‌ప్రెసిడెంట్‌గా సయ్యద్ అన్వర్, జనరల్ సెక్రెటరీగా మహమ్మద్ జహీరుద్దీన్‌లు ఎన్నికయ్యారు. మొత్తం 135 ఓట్లకు గాను 123 ఓట్లు పోలైనట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సీతారాముల కల్యాణం సూతమురారండి

నేడు శ్రీరామనవమి

ముస్తాబైన ఆలయాలు



నస్పూర్, ఏప్రిల్ 16 : సీతారాముల కల్యాణం కమనీయం, రమణీయం, వైభోగం. శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా కోదండ రామాలయాలు, వేంకటేశ్వర ఆలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో కల్యాణ మహోత్సవం నిర్వహణకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. వాడవాడల రాములోరి కల్యాణ మహోత్సవం సంబరంగా జరుగనుంది. ఆలయాల వద్ద పచ్చని పందిళ్ళు, టెంట్లు, అలంకరణలు పూర్తయ్యాయి. కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహిస్తారు. సాయంత్రం పురవీధుల్లో పల్లకి సేవా నిర్వహిస్తారు.

వడపప్పు పానకం ప్రాధాన్యం

శ్రీరామ నవమి రోజున పానకం-వడపప్పు తయారు చేసి మహా ప్రసాదంగా స్వీకరిస్తారు. దీని వెనుక ప్రాకృతిక పరమార్థమూ లేకపోలేదు. వేసవి కాలం కాబట్టి వీటిని ప్రసాదంగా సేవించడం వలన ఆరోగ్యం, ఆయుష్షు అభివృద్ధి చెందుతుందని ఆయుర్వేద పండితుల అభిప్రాయం. పానకం విష్ణువుకి ప్రీతిపాత్రమైనది. పెసర పప్పు శరీరంలోని ఉష్ణాన్ని తగ్గించి చలవ చేస్తుంది. జీర్ణశక్తిని వృద్ధి చేస్తుంది. దేహకాంతిని, జ్ఞానానికి ప్రతీక పెసర పప్పును వడ పప్పు అంటారు. మండుతున్న ఎండల్లో వడ కొట్టకుండా వేడి నుంచి కాపాడుతుందని అర్థం. పెసర బుధ గ్రహానికి ప్రీతిపాత్రమైనది.

రాములోరి పెళ్లి ముహూర్తం...

శ్రీరాముడు వసంత రుతువులో చైత్ర శుద్ధ నవమి నాడు అభిజిత్ లగ్న ముహూర్తంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12-15 గంటల సమయంలో కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరుగనుంది. శ్రీరాముడి జన్మదినమైన చైత్రశుద్ధ నవమి నాడు దేశవ్యాప్తంగా రాముడి పూజలు చేస్తారు. శ్రీరామనవమి రోజున వీధుల్లో పెద్ద పచ్చని పందిళ్ళను వేసి సీతారామ కళ్యాణం నిర్వహిస్తారు. ఇళ్ళలో సైతం యథాశక్తిగా రాముడిని పూజించి వడపప్పు పానకం, నైవేద్యం చేసి అందరికి పంచి పెడుతారు. శ్రీరామ నవమి రోజున సీతారామకల్యాణం చేయిస్తే సకల శుభాలు అష్టైశ్వరాలు లభిస్తాయని భక్తులు నమ్ముతారు. భద్రాచలం ఆలయంలో ఏ సుముహూర్తంలో కల్యాణం జరిపిస్తారో అన్ని ప్రాంతాల్లో అదే సమయానికి కల్యాణం నిర్వహిస్తారు.

దండేపల్లి: మండలంలోని పలు ఆలయాలు సీతారాముల కల్యాణానికి ముస్తాబయ్యాయి. దండేపల్లిలోని సీతారామాంజనేయస్వామి ఆలయాన్ని ఆలయ కమిటీ, హనుమాన్ దీక్షపరులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

మందమర్రి టౌన్: పట్టణంలోని మూడో జోన్ సీతారామ కోదండాలయం, పంచముఖ ఆంజనేయస్వామి, అంగడి బజార్ అంజనేయస్వామి ఆలయం, మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. కల్యాణం నిర్వహించే మండపాన్ని పాలపొర్క, పూలతో అలంకరించారు. పలు ఆలయాల్లో అన్నదానానికి ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తి శ్రద్ధలతో కల్యాణోత్సవాన్ని జరిపించాలని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. కోరెగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కల్యా ణం సందర్భంగా ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు.

జన్నారం: శ్రీరామనవమి సందర్భంగా మండల కేంద్రంలోని రామాలయంతోపాటు రేండ్లగూడలోని రామాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కల్యాణానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ప్రతీ అంశంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 16: ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు ప్రతీ అంశాన్ని చదివి, అర్థం చేసుకుని అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పోటీలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఏకెఎస్, ఐఏఎస్ అకాడమీ హైద్రాబాద్ ద్వారా అవగాహన, నమూనా పరీక్షల నిర్వహించిన సదస్సుకు అదనపు కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జీ రాహుల్, తెలుగు విశ్వ విద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసన్, అకాడమీ ప్రతినిధి హర్షలతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదవాలని సూచించారు. ఇందు కోసం అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా కృషి చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా, శాఖ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు పత్రికలు, పుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం అకాడమీ ద్వారా గ్రూప్ పరీక్షల సిలబస్ ప్రతులను, నమూనా పరీక్ష పత్రాలను అభ్యర్థులకు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రాజు, గ్రంథ పాలకులు మురళీ, సిబ్బంది కృతిన్, సంపత్,చక్రవర్తి, సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే 13న జరగనున్న పోలింగ్ రోజు అర్హులైన వారందరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లో నిర్వహించనున్న ఎన్నికల కోసం మొత్తం 741 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

నీటి ట్యాంకులను పరిశీలించిన డీఈ

వేమనపల్లి, ఏప్రిల్ 16: కొత్తగూడెం, మామడ, నీల్వాయి గ్రామాల్లోని ఓహెచ్‌ఎస్‌ఆర్ నీటి ట్యాంకులను, చేతి పంపులను, పైపులైన్‌ల నిర్మాణ పనులను మంగళవారం బెల్లంపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాంకులను శుభ్రంగా ఉంచాలని, లీకేజీలు ఉన్నా, చేతి పంపులు చెడిపోయినా మరమ్మతు చేయించాలని సూచించారు. రాచర్లలోని ప్రాణహిత నది పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏఈ నరేష్, కార్యదర్శులు సురేష్, అశోక్‌లు ఉన్నారు.

వేసవి సెలవుల్లో వేతనాలు ఇవ్వాలి

నస్పూర్, ఏప్రిల్ 16: ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్లు, క్లీనర్లకు వేసవి సెలవుల్లో వేతనాలు ఇవ్వాలని ప్రైవేట్ విద్యా సంస్థల బస్సు డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ (సీఐటీయు) జిల్లా అధ్యక్షుడు వంజర గోపీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి 12 నెలల ఫీజు వసూలు చేస్తూ డ్రైవర్లకు, క్లీనర్లకు రెండు నెలల జీతం ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యా సంస్థ యజమానులు ఆలోచించి డ్రైవర్లు, క్లీనర్లను ఆదుకోవాలని ఆయన కోరారు.

హన్మాన్ దీక్షాపరుల ఆందోళన

- బాలస్వాములను యూనిఫాం వేసుకోవాలన్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం
- కన్నెపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో



కన్నెపల్లిలో రాస్తారోకో చేస్తున్న హనుమాన్ దీక్షాపరులు, వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ

దండేపల్లి, ఏప్రిల్ 16: హన్మాన్ దీక్షాపరులు ప్రైవేట్ పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. హన్మాన్ మాల ధరించిన ముగ్గురు విద్యార్థులు మంగళవారం పాఠశాలకు వెళ్ళగా వారిని పరీక్షలకు నిరాకరించిన సంఘటన కన్నెపల్లి మదర్‌థెరిస్సా పాఠశాలలో చోటు చేసుకుంది. నంబాల గ్రామానికి చెందిన బంగారు దీవెన్, కన్నెపల్లికి చెందిన గొర్ల విద్యాదిత్యా, రాయపట్నం చెందిన హర్షవర్ధన్ అనే ముగ్గురు విద్యార్థులు 4వ తరగతి చదువుతున్నారు. వారు హన్మాన్ దీక్ష స్వీకరించారు. సోమవారం నుంచి వార్షిక పరీక్ష ప్రారంభం కావడంతో పరీక్షలు రాసేందుకు రాగా పాఠశాల మేనేజర్ జైసన్ నిరాకరించాడు. కాషాయ వస్త్రాలను తొలగించి యూనిఫాం వేసుకుంటేనే పరీక్షకు అనుమతి ఇస్తామని తెలిపాడని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వారు తల్లిదండ్రులకు చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, హన్మాన్ దీక్షాపరులు పెద్ద సంఖ్యలో పాఠశాలకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. పాఠశాల ఆఫీస్, తరగతి గదుల అద్దాలు, మదర్‌థెరిస్సా విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న లక్సెట్టిపేట సీఐ నరేందర్, దండేపల్లి, లక్సెట్టిపేట ఎస్సైలు స్వరూపరాజ్, చందన్‌కుమార్ సిబ్బందితో చేరుకొని వారిని శాంతింపజేసేందుకు యత్నించారు. వారు వినకపోవడంతో ఏసీపీ ప్రకాష్‌కు తెలియజేయగా ఏసీపీ నచ్చజెప్పే యత్నం చేశారు. సుమారు అర గంటపాటు ఏసీపీ, పోలీసులు, స్వాముల మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. పాఠశాల మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలని, పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఈవో రవీందర్ సంఘటనా స్థలానికి చేరుకొని జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల యాజమాన్యానికి నోటీస్ ఇచ్చారు. వివాదం సద్దుమణగకపోవడంతో డీసీపీ అశోక్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని హన్మాన్ దీక్షాపరులతో మాట్లాడారు. సంఘటనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీసీపీ అన్నారు. సున్నితమైన అంశమైనందున పాఠశాల యాజమాన్యంతో బహిరంగ క్షమాపణ చెప్పించలేమని, చట్టం ప్రకారం నడుచుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.